

జల్లేరుకు వరద హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు

తెలుగు రాష్ట్రాలపై రాష్ట్రాలపై నెలకొన్న అల్పపీడనం మరో 48 గంటల పాటు కొనసాగుతుందని అంచనా మేరకు వర్షపాతం లేదా వరద విడుదలలో గణనీయమైన పెరుగుదల ఉంటే జల్లేరు రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లను తెరచి మిగులు జలాలను విడుదల చేస్తామని జలవనరుల శాఖ ఎస్ఇ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలివేరు నుంచి జల్లేరు రిజర్వాయర్ దిగువకు వరదనీరు విడుదల చేసే సమయంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, వివిధ శాఖల అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జల్లేరు రిజర్వాయర్ 382.00ఎంసిఎఫ్‌టి సామర్ధ్యంతో 215.10 ఎంటిఎస్ వద్ద గరిష్ట నీటి మట్టం 217.80 ఎంటిఎస్ వద్ద 540.00 ఎంసిఎఫ్‌టి సామర్ధ్యంతో 238 క్యూసెక్కుల స్థిరమైన ఇన్‌ఫ్లో ఉందన్నారు.

వరద గుబులు..!

తగ్గుతూ.. పెరుగుతూ..
పరుగులు పెట్టిస్తున్న గోదావరి
జల్లేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వ ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
కివ్వాక పునరావాస కాలనీకి కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితులు
భద్రాచలం వెళ్లే బస్సులు కుక్కునూరు వరకే
ప్రమాదపుటంచున లంక గ్రామాలు



కుక్కునూరు మండలంలోకి భారీగా చేరిన గోదావరి వరద

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద ప్రజల్లో గుబులు పుట్టిస్తోంది. తగ్గుతూ..పెరుగుతూ గోదావరి వరద ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను భయపెడుతోంది. ఏజెన్సీలోని తమ్మిలేరు, జల్లేరు ప్రాజెక్టులకు పెద్దఎత్తున చేరుతున్న వరదనీరు దిగువ గ్రామ ప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది. గడచిన వారం రోజులుగా జిల్లాను వర్షాలు వెంటాడుతున్నాయి. దీనికితోడు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉరకలు వేస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఒక్కరోజులో 51 అడుగులకు చేరడంతో అంతటా ఆందోళన నెలకొంది. గురువారం కొంత తగ్గుముఖం పట్టి 48 అడుగులకు చేరినప్పటికీ పరిస్థితి మాత్రం ఇంకా ఆందోళన రేకెత్తిస్తూనే ఉంది. పోలవరం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 34 మీటర్లు దాటింది. దీంతో దిగువకు 11.78 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరదకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో కుక్కునూరు ఎ బ్లాక్‌కు చెందిన దాదాపు 200 కుటుంబాలు గురువారం కివ్వాక పునరావాస కాలనీకి తరలివెళ్లాయి. ఇప్పటికే గొమ్ముగూడెం, రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన ప్రజలు రావికుంట పునరావాస కాలనీకి చేరారు. కుక్కునూరు మండలంలో కౌండిన్యముక్తి గ్రామంతోపాటు, వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలను గురువారం పునరావాస కాలనీలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ గోదావరి తగ్గుముఖం పట్టడంతో తాత్కాలికంగా ఆ ప్రక్రియ నిలిపివేశారు. దాచారం, కుక్కునూరు, ముత్యాలంపాడు, వింజరం, సీతారాంనగరం, శ్రీధర్ గ్రామాల మధ్య కాజ్‌వేలు నీట మునగడంతో 20 గ్రామాలకుపైగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలేరు, బూర్గంపాడు మధ్యలో ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం వెళ్లే బస్సులు కుక్కునూరు నుంచి వెనక్కి తిరుగుముఖం పడుతున్నాయి. వరద భయంతో ఏజెన్సీ ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. కాపర్‌డ్యామ్ ప్రభావంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరుగుతున్న తీరు అందరినీ తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

జల్లేరు, తమ్మిలేరు, ఎర్రకాల్వ ప్రాజెక్టు దిగువ గ్రామాలకు వరద హెచ్చరికలు

ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్‌కు పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. దీంతో దిగువకు నీరు విడుదల చేయాల్సి ఉంటుందని, ప్రాజెక్టు దిగువన ఉన్న చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించారు. తమ్మిలేరు రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం 345 అడుగులకు వరద నీరు చేరింది. ప్రస్తుతం 3,600 క్యూసెక్కుల నీరు వచ్చిపడుతోంది. దీంతో ఏక్షణానైనా గేట్లు ఎత్తి దిగువకు వరద నీరు విడుదల చేయనున్నారు. ఏజెన్సీలోని జల్లేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు, ఎర్రకాల్వ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వస్తోంది. దిగువకు నీరు విడుదలచేస్తే జంగారెడ్డిగూడెం, బుట్టాయ గూడెం మండలాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, భీమవరం, తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. జల్లేరు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 217 మీటర్లు. ప్రస్తుతం 215 మీటర్లకు వరదనీరు చేరింది. ప్రస్తుతం 238 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి వస్తోంది. తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి వరదనీరు దిగువకు విడుదల చేస్తే జిల్లా కేంద్రం ఏలూరును సైతం వరద నీరు చుట్టు ముట్టనుంది. దీంతో ఏలూరు నగర ప్రజల్లోనూ గుబులు నెలకొంది.



ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న జెసి

పునరావాసాలకు ముంపు బాధితులు

ప్రజాశక్తి - కుక్కునూరు

వరద ముంపు గ్రామాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. మండలంలో వరద ముంపు ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఆమె గురువారం పర్యటించారు. ముందుగా దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలను పరిశీలించారు. మండలంలోని గొమ్ముగూడెంకి చెందిన 253 కుటుంబాలకు చెందిన 743 మంది, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 205 కుటుంబాలకు చెందిన 611 మందిని పునరావాస కేంద్రానికి తరలించామని, వారికి భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామని, తాగునీటికి ఇబ్బంది లేకుండా రెండు బోర్లు వేసినట్టు అధికారులు జెసికి తెలిపారు. పునరావాస కేంద్రంలో ప్రజలకు వరద సాధారణ పరిస్థితి వచ్చే వరకూ భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను జెసి సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. కేంద్రంలో సంపూర్ణ పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్ ఏర్పాటు చేయాలని అధికారులను జెసి ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

అనంతరం కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయంలో వరద పునరావాస కార్యక్రమాలపై అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ముంపునకు గురికాకుండా వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వరద పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. వరద అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు వేలేరుపాడు మండలంలో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను, కుక్కునూరు మండలంలో ఒక ఎస్‌డిఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేశామన్నారు. వరద కారణంగా రవాణా మార్గానికి అంతరాయం ఏర్పడిన గ్రామాల్లోని విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఎలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ మండల అధికారులకు సమాచారం అందించాలన్నారు. జెసి వెంట నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఐటిడిఎ పిఒ సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల అధికారులున్నారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలోని వరద పునరావాస కేంద్రంలో ప్రజలకు అధికారులు స్వయంగా భోజనం వడ్డించారు.



ముంపు పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ముంచిన కొల్లేరు బ్యాక్‌వాటర్

ప్రజాశక్తి - భీమడోలు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతం నుంచి కొల్లేరు సరస్సులోకి చేరిన వరద నీరు వెనక్కి ఎగదన్నడంతో మండలంలోని కొల్లేరు పరిధిలోని పొలాలు నీటమునిగాయి. శుక్రవారం భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి తన బృందంతో ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఇప్పటి వరకూ 450 ఎకరాలు విస్తీర్ణంలో నాట్లువేసిన పొలాలు నీటమునిగాయని, సుమారు నాలుగు అడుగులు పైబడి నీరు పొలాల్లో నిల్వ ఉందని తెలిపారు. శుక్రవారం వానలు కురవటం ఆగిపోయినప్పటికీ కొల్లేరు సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరుచేరి వెనక్కు ఎగదనటంతో పొలాల ముంపు మరింతగా పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. దీనికి ప్రధాన కారణం కొల్లేరు సరస్సు ప్రాంతంలో గల మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం, చేపల చెరువు గట్లు ప్రవాహానికి అడ్డుగా ఉండటంతో ముంపు ఇప్పట్లో తగ్గే అవకాశం లేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ముంపు మరొక రెండు రోజులపాటు కొనసాగితే నాట్లు కుళ్లిపోయి రైతుల నష్టపోయే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాలపై వ్యవసాయాధికారి మాట్లాడుతూ మూడు రోజులుగా మండల పరిధిలో 18 మిల్లీమీటర్లు, 54 మిల్లీమీటర్లు, 32 మిల్లీమీటర్లు వర్షపాతం వరుసగా నమోదైందన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - దెందులూరు

భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురై నష్టపోయిన కౌలురైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు మండలంలోని పోతునూరు, దోసపాడు, కొవ్వలి గ్రామాల్లో పంటలు ముంపునకు గురైన ప్రాంతాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించారు. చేపల చెరువులను తలపిస్తూ ముంపులో ఉన్న వరి పంటను పరిశీలించారు. పోతునూరు, తుమ్మలగుంట ఆయకట్టులో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి మురుగు కాలువలను బాగుచేయాలంటూ ఆందోళన చేపట్టారు. లంక కాలువను ఆనుకుని ఉన్న మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మురుగు కాలువలు బాగు చేయకపోవడం వల్ల గుర్రపు డెక్క, కిక్కిస, జమ్ము, తూడు వల్ల కాలువలు పూడిపోయి కొల్లేరులోకి వర్షపు నీరు వెళ్లక నీరు ఎగదన్ని పంటలు ముంపునకు గురై కౌలురైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మురుగు కాలువలను యుద్ధ ప్రాతిపదికన బాగు చేయాలని కోరారు. పంట నష్టాలు నమోదు చేసి పరిహారమిచ్చి కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.15 వేలు నష్ట పరిహారమివ్వాలని కోరారు. ముంపు నివారణకు చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు జి.రాజా, ఉమ్మడి అచ్యుతరామయ్య, ఉమ్మడి హనుమంతరావు, పాముల దుర్గారావు, కొత్తగళ్ల శ్రీనివాసరావు, రొంగల శ్రీను, గౌరీ రాము, ఉమ్మడి పుల్లయ్య, నాగనబోయిన శివయ్య, కొండా ఏసు, కౌలు రైతులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ట్రిపుల్ ఐటిల్లో రెండో కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన 751 సీట్ల భర్తీకి వచ్చేనెల 9,10 తేదీల్లో రెండో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ఆర్‌జెకెయుటి ఛాన్సలర్ ఆచార్య కెసి.రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత కౌన్సెలింగ్‌లో చేరిన విద్యార్థులు క్యాంపస్ మారాలనుకుంటే వచ్చేనెల ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉధృతంగా వాగులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో కురిసిన భారీవర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ వాగుల ప్రవాహం ఆగలేదు. ప్రధానంగా మండలంలోని జలవాగు, ముగ్గురాళ్లవాగు, ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో మక్కినవారిగూడెం నుండి టి.నరసా పురం, మక్కినవారిగూడెం నుండి బండి వారి గూడెం, అప్పలరాజు గూడెం నుండి మధ్యాహ్నపువారిగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకు పంచాలి : వ్యకాస

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



మాట్లాడుతున్న రామకృష్ణ

ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉన్న రెండు లక్షల ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను పేదలకు పంచి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ చేస్తామని చెప్పి జిల్లాలోని ల్యాండ్ సీలింగ్ ఎల్‌టిఆర్, పోడు భూములు, ఇలా 18 రకాల భూములను లక్షలాది ఎకరాలు అన్యాక్రాంతం చేశారన్నారు. భూస్వాముల, అధికార పార్టీ నాయకుల స్వాధీనంలో ఉన్నాయన్నారు. వాటిని వెలికితీసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఎర్ర కాలువ ల్యాండ్ సీలింగులు, ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్ఆర్ పోడు భూముల కోసం, దోసపాడు దళితుల భూపోరాటం చేస్తున్నారని తెలిపారు. చింతలపూడి, లింగపాలెం ఏరియాల్లో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని వాటిని పేదలకు, గిరిజనులకు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ చట్ట సవరణకు ప్రయత్నిస్తోందని, దీన్ని విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి.సత్యనారాయణ, ఆర్.డానియేలు, ఎస్.మహంకాళి, టి.ముత్యాలమ్మ, ఎం.సుధారాణి, వై.సీత, జి.వెంకట్రావు, ఎ.ప్రభాకర్‌రావు, చిన్నం మాధవ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులను విస్మరించిన ప్రభుత్వాలు

రెండో రోజుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, గిరిజన సంఘం బైక్‌యాత్ర

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



బైక్‌యాత్రలో నాయకులు

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొయ్యలగూడెం మండలంలో బుధవారం ప్రారంభమైన బైక్ యాత్ర రెండోరోజు గురువారం మండలంలోని బూసరాజుపల్లి ఎపి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల నుండి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని, గిరిజన హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. పులిరాముడుగూడెం హాస్టల్లో ఒక విద్యార్థి హత్య జరిగిన తరువాత గానీ ఆ హాస్టల్‌కు కనీస మౌలిక వసతులు కల్పించారన్నారు. అదేవిధంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఈ విధమైన వసతులు, సీసీ కెమెరాలను అధికారులు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడు గదులు లేవని, డైనింగ్ హాళ్లు కూడా లేకపోవడం, ఉన్న డైనింగ్ హాళ్లు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గిరిజన హాస్టళ్లలో నిత్యావసర సరుకులు కాంట్రాక్ట్ పద్ధతిలో అందిస్తున్నారని, కాంట్రాక్టుదారులు టెండర్ వేయడానికి వచ్చినప్పుడు ఒక క్వాలిటీ ఒకరేటు విద్యార్థులకు సరఫరా చేసే సమయంలో నాసిరకం కనిపిస్తుందన్నారు. ఈ విధంగా విద్యార్థులకు నాశిరకమైన సరుకులు సరఫరా చేస్తున్నారన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఒ3ను చేసిందని, దీనివల్ల స్థానిక గిరిజన యువకులకు ఉద్యోగాలు లేకుండా పోయాయని విమర్శించారు. గిరిజనేతులకు ఉద్యోగాలు ఎక్కువ కల్పిస్తున్నారని, జిఒ3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో స్పెషల్ డిఎస్‌సి తీసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన విద్యాలయంవైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి కూడా చూడటం లేదని, గిరిజన సంక్షేమ ఖాతాలోని నిధులను నాడు-నేడు పథకానికి మళ్లించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు జి.మణి, రాజేష్, దుర్గారావు పాల్గొన్నారు.

13 మందికి 'విదేశీ విద్యాదీవెన' లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిభ ఉండి కూడా పేదరికం కారణంగా విదేశాల్లో చదువుకోలేని విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన బాసటగా నిలబడుతూ వారి విదేశీ విద్యకయ్యే పూర్తి ఫీజును ప్రభుత్వమే భరిస్తోందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న విదేశీ విద్యాదీవెన కింద అర్హులైన 357 మంది విద్యార్థులకు రూ.45.53 కోట్లను విద్యార్థుల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమానికి ఏలూరు కలెక్టరేట్ నుండి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, జిల్లా బిసి సంక్షేమాధికారి నాగరాణి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కృపావరం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సిఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఏలూరు జిల్లాకు సంబంధించి అర్హులైన 13 మంది విద్యార్థులకు మంజూరైన రూ.కోటీ 25 లక్షల 92,786 మెగా చెక్కును విద్యార్థులకు వారి తల్లులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకోవాలనే ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అలాంటి విద్యార్థులు ప్రపంచంలోనే టాప్ యూనివర్శిటీల్లో చదువుకునేందుకు వీలుగా విదేశీ విద్యకయ్యే పూర్తిఫీజును భరిస్తుందన్నారు. జిల్లాలో ఈ విడతలో ఎస్‌సి కేటగిరిలో ఒక విద్యార్థికి రూ.8.25 లక్షలు, బిసి కేటగిరికి చెందిన ముగ్గురు విద్యార్థులకు రూ.2.96 లక్షలు, ఇబిసి కేటగిరికి చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.55.09 లక్షలు, కాపు కేటగిరికి చెందిన ఇద్దరు విద్యార్థులకు రూ.32.89 లక్షలు, మైనార్టీ కేటగిరికి చెందిన విద్యార్థికి వీసా ఖర్చుకోసం రూ.13 వేలు విడుదలయ్యాయన్నారు.

ఈ మొత్తంలో ఆయా విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, విమాన ఖర్చులు, వీసా ఫీజు ఉన్నాయన్నారు. మంచి ర్యాంకులు సాధించి ప్రపంచంలోని టాప్ యూనివర్శిటీల్లో ప్రవేశంపొందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకూ ఇతర విద్యార్థులకు రూ.కోటి వరకూ పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి అర్హతను కూడా రూ.ఎనిమిది లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు.

ముంపు గ్రామాలు గజగజ

భారీగా చేరుతున్న గోదావరి వరద
కుక్కునూరులో 20 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
జలదిగ్బంధంలో వేలేరుపాడు మండలం
సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న బాధితులు
కుక్కునూరు - భద్రాచలం రోడ్డులో నిలిచిన ప్రయాణాలు



సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న కుక్కునూరు మండల ప్రజలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడం, శబరి నది పొంగడం, కాపర్ డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రభావంతో గోదావరికి భారీగా వరద చేరడంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కుక్కునూరు - దాచారం మధ్య గుండేటివాగుపై ఉన్న కాజ్‌వే వారంరోజులుగా ముంపులో ఉండటంతో 14 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరదల కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను వారం రోజుల క్రితం అధికారులు రావికుంటపునరావాస కేంద్రానికి తరలించారు. గురువారం ఉదయం భద్రాచలంలో 50 అడుగులకు చేరుకుని రెండో ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని ముత్యాలంపాడు, వింజరం, సీతారామనగరం ప్రధాన రహదారులపైకి వరద చేరడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు పూర్తిగానిలిచాయి. వేలేరు, బూర్గంపాడు మధ్య ప్రధాన రహదారిని వరద ముంచెత్తడంతో కుక్కునూరు - భద్రాచలానికి రహదారి లేకపోవడంతో ఆర్‌టిసి బస్సులు, బస్సులు, లారీలు, ఇతర ప్రయివేటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి కుక్కునూరు నుండే



సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న వేలేరుపాడు మండల ప్రజలు

వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి వరద పెరిగి కుక్కునూరు 'ఎ' బ్లాక్‌ని ముంచెత్తడంతో అక్కడ ఉన్న 200 కుటుంబాలవారు సామగ్రిని తీసుకుని ట్రాక్టర్లపై కివ్వాక పునరావాస కేంద్రానికి తరలివెళ్లారు. వరద పెరిగితే కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉంటుంది. భద్రాచలంలో ప్రస్తుతం గోదావరి తగ్గుముఖం పట్టినా శబరి నది ఉధృతి, పోలవరం కాపర్ డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రభావంతో వరద క్రమంగా పెరుగుతుండటంతో మండల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వరద ప్రాంతాలను సందర్శించిన ఐటిడిఎ పిఒ

గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో కెఆర్.పురం ఐటిడిఎ పిఒ సత్యనారాయణ సందర్శించారు. మండలంలోని లోతట్టు ప్రాంతమైన కౌండిన్యముక్తి గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని, వరద పెరిగితే ముందుగానే తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఆందోళన చెందొద్దని తెలిపారు. అనంతరం కివ్వాక పునరావాస కేంద్రంలో వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు పిఒ సూచించారు.



కొండగుట్టపై వేలేరుపాడు మండల బాధితులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు

వేలేరుపాడు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా ప్రాజెక్టుల్లోకి చేరిన అదనపు జలాలను గోదావరిలోకి వదలడంతో ఉగ్రరూపం దాల్చింది. దీంతో మండలం చుట్టూ వరదనీరు చేరడంతో గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇప్పటికే వేలేరుపాడు, రేపాకగొమ్ము, రుద్రంకోట, వసంతవాడ, వేలేరుపాడు, కన్నాయిగుట్ట, బోళ్లపల్లి, ఎడవల్లి గ్రామాల్లోని ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో వారంరోజులుగా 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోళ్లపల్లి, ఎడవల్లి గ్రామాల ప్రజలు అత్యవసరపరిస్థితుల్లో నాటుపడవల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 200 కుటుంబాలను రావికుంటపునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. భద్రాచలంలో గోదావరి వరద 54 అడుగులకు చేరింది. వేలేరుపాడు మండలంలోని గ్రామాల చుట్టూ వరద చేరుతుండటంతో రహదారి సౌకర్యం లేని నార్లవారం గ్రామంలోని 120 కుటుంబాలను నాటుపడవల్లో సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని తాట్కూరుగొమ్ము, రుద్రంకోట, చిగురుమామిడి, కోయిదా, కట్కూరు, ఎడవల్లి, టెకూరు, చిత్తిరెడ్డిపాలెం, ఎర్రతోగు గ్రామాల చుట్టూ వరద నీరు చేరడం, రహదారి సదుపాయం లేకపోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ గ్రామాలకు చెందిన కుటుంబాలు దగ్గరలోని కొండ గుట్టలమీద గుడారాలు వేసుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి. మండల కేంద్రం వేలేరుపాడులోకి వరద నీరు చేరుతుండటంతో గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు. గుట్టలమీద ఉంటున్న వరద బాధితులకు కరెంటు లేకపోవడంతో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరికి సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. వరద అంతకంతకూ పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాలబాధితులను ఎన్‌డిఆర్ఎఫ్ ప్రత్యేక బలగాల సహాయంతో పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తహశీల్దార్ రమేష్ తెలిపారు.

కుక్కునూరు మండలంలోకి పోటెత్తిన గోదావరి వరద



భీమడోలులో పశు వైద్యశాలలు విలీనం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రాంతీయ పశు వైద్యశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా నిడమర్రు మండలంలోని రెండు పశువైద్య కేంద్రాలు, ఐదు లైవ్ స్టాక్ కేంద్రాలు భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోకి వచ్చాయని భీమడోలు పశు వైద్య సహాయ సంచాలకుల డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ తెలిపారు. ఇకనుంచి నిడమర్రు మండలంలోని నిడమర్రు, పెద నిండ్రకొలను పశు వైద్యశాలలు భీమడోలు ప్రాంతీయ పశు వైద్యశాలలో విలీనం అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల బిల్లులను విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం ఉంగుటూరు మండలానికి చెందిన మినీ గోకులం షెడ్ల బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు అవి వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో గేదెలకు గొంతువాపు, ఆవులకు, ఇతరులకు జబ్బ వాపు వ్యాధులు వాతావరణ పరిస్థితుల కారణంగా సోకుతున్నాయన్నారు పశువులు మొలకెత్తిన తాజా గడ్డిని తినటం వల్ల ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు అవసరమైన టీకాలు, ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలోని పది పశువైద్యశాలలు, పది వరకు లైవ్ స్టాక్ సెంటర్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.



రైతులకు నవధాన్య విత్తనాలు అందిస్తున్న అధికారులు

రైతులకు ఉచిత నవ ధాన్య విత్తనాలు

ప్రజాశక్తి - ముసునూరు

పంట భూముల్లో రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూసారం తగ్గి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతారని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ నాగదేశి రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ ఆధ్వర్యంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం వారితో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు నవధాన విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ నాగదేశి రవికుమార్, జెడ్‌పిటిసి సభ్యులు డాక్టరేట్ ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, హిష్టరీ డైరెక్టర్ పి.స్వరూపరాణి ఆధ్వర్యంలో ఉచిత నవధాన్య విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాణి, కోర్లగుంట ఎంపిటిసి సభ్యులు సుందరరావు, సర్పంచులు చలసాని దామోదరరావు, కంచర్ల వాణి, జోనల్ కో-ఆర్గనేటర్ ఆగస్టన్, జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్.సుబ్బరాజు పాల్గొన్నారు.

వరి పంటను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

నీట మునిగిన వరి పంట పొలాలను రక్షించుకునేలా వర్షపు నీటిని బయటకు తోడిన వెంటనే యూరియా ఎంఒపి కలిపి పొలాల్లో వేసుకుంటే వరికి ఇబ్బంది ఉండదని వ్యవసాయ శాఖాధికారి జరీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులుగా కుండపోతగా కురిసిన వర్షాలకు వరి పంట పొలాలు నీట మునిగాయని పేర్కొన్నారు. తాను గురువారం పంట పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. పంట పొలాల నుంచి నీటిని బయటకు పంపే క్రమంలో డ్రెయిన్లు క్లియర్ చేయడంలో రైతులకు అండగా ఉండే విధంగా స్థానికులు గాని, యంత్రాల ద్వారా గాని ప్రతి ఆర్‌బికె పరిధిలో పనులు చేయడానికి ఎంపిడిఒలు, ఎపిఒలు ఇరిగేషన్ వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పని చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. రైతన్నలు వర్షపు నీటిని బయటకు తోడే క్రమంలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షపు నీటిని పొలం నుంచి బయటకు తోడిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా 15 కిలోల ఎంఒపి కలిపి పొలంలో వేసుకోవాలన్నారు. జింకు ధాతు లోప నివారణకు మూడు జింకు లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని, లేదా చలామిన్ ఎకరానికి వంద గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. అధికారుల సూచనల మేరకు పిచికారీ చేసి వరి పంటను రక్షించుకోవాలని ఆమె సూచించారు.

రైతులకు అందుబాటులో రసాయనిక ఎరువులు

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు అందుబాటులో రసాయనిక ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రాయితీ ధరలతో ఎరువులను అందించనున్నట్లు తెలిపారు.

మూడు చక్రాల మోటార్ వాహనాలు పంపిణీ

నూజివీడు రూరల్ :నూజివీడు నియోజకవర్గంలోని పది మంది వికలాంగులకు మంజూరైన మూడు చక్రాల మోటారు వాహనాలను ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రూ.1.20 లక్షల విలువైన వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిందన్నారు. వికలాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

మండవల్లి :మండవల్లి రైల్వే గేటు వద్ద ట్రాక్‌పై మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో 62వ రైల్వే గేటును మూసివేస్తున్నట్లు రైల్వే ఇంజినీర్ మేకల శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు మోటూరు కైకలూరు రైల్వే మార్గమధ్యంలో ఉన్న పసలపూడి లేళ్లపూడి గేటును మూసివేస్తున్నామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

చిన్నారిపై వ్యక్తి దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిపై వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపల్లికి చెందిన చిన్నారి రజిని ఐదో తరగతి చదువుకుంటుంది. ఈ క్రమంలో గురువారం ఇంటి బయట ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కుతాటి చంటి చిన్నారిపై దాడి చేశారు. ఈ దాడిలో చిన్నారి తలకు బలమైన గాయమైంది. చిన్నారిని కుటుంబసభ్యులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పాలచర్ల రాజవరం గ్రామానికి చెందిన యు.అన్నపూర్ణ అశ్వారావుపేట నుంచి జీలుగుమిల్లి స్కూటీపై వస్తూ అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ సమీపంలో అదుపుతప్పి కింద పడటంతో గాయాలపాలైంది. స్థానికులు ఆమెను జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం వైపునకు వెళ్తున్న ఆటో నుంచి తాటియాకులగూడెం శివారు వద్ద కె.శివ అనే వ్యక్తి కింద పడిపోయాడు. అతనికి గాయాలు కావడంతో స్థానికులు జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 108లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తెలంగాణ మద్యం పట్టివేత

జీలుగుమిల్లి :మండలంలోని తాటియాకులగూడెంలోని ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద గురువారం ఎస్ఇబి ఎస్ఐ క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రాకు మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. మద్యాన్ని, వ్యాన్‌ను సీజ్ చేసి ఒకరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపారు.

మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

హరిశ్చంద్రప్రసాద్, జెఆర్‌డి.టాటా జయంతి, అబ్దుల్‌కలాం వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశ ఆర్థిక పురోగతికి ఎనలేని సేవలందించిన మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పారిశ్రామికవేత్త, మైనింగ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సర్‌సిఆర్ రెడ్డి కళాశాల సిఐఐఇ, ఇడిసి, ఎంబిఎ, ఐక్యూ ఎసి వారి ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ జయంతి, టాటా గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షులు భారతరత్న జెఆర్‌డి.టాటా జయంతి, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె.అబ్దుల్‌కలాం వర్ధంతి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారు చూపించిన మార్గదర్శకాన్ని అవలంభించటం వల్ల వ్యక్తిగతంగా మనకు, మన దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, భారతరత్న జెఆర్‌డి.టాటాలు అందుకు ఆదర్శనీయులుగా నిలుస్తారని కొనియాడారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్‌కలాం తుది శ్వాస వరకు విద్యార్థులను అవగాహన పరచడంలో వారి అభ్యున్నతికి,


భీమడోలులో అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులు

దేశ సాంకేతిక విజ్ఞాన రంగానికి విశిష్టమైన సేవలందించిన ప్రముఖులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్, పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ కరస్పాండెంట్ కె.శివరామకృష్ణప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వీరభద్రరావు, పీజీ కళాశాల ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ విఆర్ఎస్.బాబు యలమర్తి పాల్గొన్నారు.

భీమడోలులో అబ్దుల్‌కలాం వర్ధంతి సభ

భీమడోలు :కెమెరా సృష్టికర్త డ్యాగురే, పీపుల్స్ ప్రెసిడెంట్‌గా గుర్తింపు పొందిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వేదిక వద్ద భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షులతో పాటు పిల్లి బ్రహ్మారావు, సంఘ అధ్యక్షులు డి.శ్రీరామ్ ఇతర కార్యవర్గ సభ్యులు అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యువతకు అబ్దుల్‌కలాం స్ఫూర్తి ప్రదాత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు డేవిడ్, పివిఆర్.మూర్తి పాల్గొన్నారు.

ముసునూరు : భారత రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాం ఎన్నో సేవలందించారని భారతి కాన్వెంట్ ప్రిన్సిపల్ కొండేటి శౌరి, కరస్పాండెంట్ కొండేటి విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులోని భారతి ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌లో అబ్దుల్ కలాం ఎనిమిదో వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన చేసిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి

ఎంపిపి పోసమ్మ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ఉన్న అధికారులు, సచివాలయ సిబ్బంది మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి కోర్స పోసమ్మ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ కలిసికట్టుగా మండలంలో సమస్యలపై దృష్టి పెట్టి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో జరిగిన అభివృద్ధి పథకాలపై ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్, ఎంపిపి-2 ఉప్పల లలితకుమారి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్, తహశీల్దార్ సుందర్‌సింగ్, ప్రజా ప్రతినిధులు, పలువురు సర్పంచులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత సెంటర్‌లో చేర్చాలి

ప్రజాశక్తి - ముసునూరు

అంగన్‌వాడీలో చదువుతున్న ప్రత్యేక అవసరాల గల పిల్లలను భవిత సెంటర్‌లో చేర్చాలని ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి సూచించారు. మండలంలోని ముసునూరు అంగన్‌వాడీ సెంటర్-207లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో చదువుతున్న ప్రత్యేక అవసరాల గల విద్యార్థులను భవిత సెంటర్‌లో చేర్చాలని కోరారు.

ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా వరప్రసాదరావు

ప్రజాశక్తి - ఏలూరు

ఎపి మెడికల్ కౌన్సిల్ కమిటీ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాదరావును ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా నామినేట్ చేస్తూ ఎపి మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ బిఎస్.శివారెడ్డి ఎపి ఫార్మసీ కౌన్సిల్‌కు లేఖ ద్వారా తెలిపారు. ఈ మేరకు ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా నామినేట్ అయిన డాక్టర్ డి.వరప్రసాదరావును ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అభినందించారు.

రాధమ్మ మృతి బాధాకరం

ప్రజాశక్తి - మండవల్లి

కుటుంబంలో మంచి చెడులు, ఎలా జీవించాలో తెలిపే పెద్ద వ్యక్తులను కోల్పోవడం బాధాకరమని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని లింగాలలోని గరికపాటి రామ్మోహన్‌రావు మాతృమూర్తి గరికపాటి రాధమ్మ పెద కర్మ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎంపిపిలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, మండవల్లి, ముదినేపల్లి మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, మోటో ఏసుబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, రాచూరి కుమార్, బావిశెట్టి స్వామి పాల్గొన్నారు.

రహదారుల అధ్వానంపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలోని గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ గోతులు పడిపోయి చెరువులను తలపించే విధంగా ఉన్నాయని టిడిపి సీనియర్ నాయకులు జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ ఛైర్మన్ షేక్ ముస్తఫా విమర్శించారు. షేక్ ముస్తఫా ఆధ్వర్యంలో టిడిపి నేతలు జెపి సెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా బైపాస్ రోడ్డు ఎస్ఆర్ బంకు వరకు నిరసన యాత్ర చేశారు. రోడ్డుపై ఏర్పడ్డ గోతుల్లో చేపలను పట్టి, వరి నాట్లు నాటి నిరసన తెలిపారు. బైపాస్ రోడ్డు ఎస్ఆర్ బంకు వద్ద రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కరటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, సీనియర్ నాయకులు తుటికుంట దుర్గారావు, వందనపు హరికృష్ణ, షేక్ యాకూబ్, ఈర్ని సూరిబాబు, తుటికుంట రాము, పాకనాటి కాశి, బొంగు నాగేశ్వరరావు, అప్పికొండ సుబ్బారావు, వేములపూడి నాగరాజు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ సర్వేలో ఇబ్బందులు

యాప్ పనిచేయకపోవడంతో బిఎల్ఒల అవస్థలు

ప్రజాశక్తి - భీమడోలు

ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేసేందుకు బిఎల్ఒలకు ఇచ్చిన యాప్‌లు సక్రమంగా పనిచేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు బిఎల్ఒలు చెబుతున్నారు. భీమడోలు మండల పరిధిలో సర్వే కార్యక్రమం ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో సర్వే బృందాలు ఇప్పటివరకు నమోదైన 51,279 మంది ఓటర్ల వివరాలను సేకరించాల్సి ఉంది. ఈ మేరకు 53 మంది బిఎల్ఒలు రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో వారి విధులను నిర్వహిస్తున్నారు. నిర్వహించిన సర్వేల్లో ఇంటి నెంబర్ లేని 94 మంది ఓటర్లను గుర్తించారు. వీరి ద్వారా సదరు లోపాలను సవరించేందుకు మార్పులు, బదిలీల కోసం ప్రత్యేకించిన ఫారం-8లను బిఎల్ఒలు తీసుకున్నారు. ఒకే డోర్ నెంబర్‌లో పది లేక అంతకన్నా ఎక్కువ మంది ఓటర్లుగా నమోదైన ఇళ్ల సంఖ్య 155 ఉండగా వీటిలో 1957 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. వీరినుంచే ఫారం-8 తీసుకొని లోపాలను సవరించే కార్యక్రమం చేపట్టామని బిఎల్ఒలు తెలిపారు.

కానుకొల్లులో జిల్లా అధికారుల పర్యటన

ప్రజాశక్తి - మండవల్లి

కానుకొల్లులో రొయ్యల చెరువు తవకంపై దళితులకు, చెరువుదారుడికి మధ్య ఏర్పడిన వివాదంలో జిల్లా అధికారులు స్పందించారు. చెరువు తవ్వే తీరుతానని చెరువుదారుడు, వద్దంటూ దళితుల మధ్య జరిగిన పోరాటం తెలిసిందే. ఈ విషయంపై చెరువుదారుడు, దళితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటీ అగ్రికల్చరల్ జెడి రామకృష్ణ ఇరిగేషన్ ఎస్‌సి శ్రీనివాసరావులు కానుకొల్లులో గురువారం పర్యటించారు. మంచినీటి బావులను రొయ్యల చెరువులుగా తవ్వే పొలాన్ని వారు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. చెరువు తవ్వకాలను నిలుపుదల చేసి ఆదుకోవాలని దళితులు అధికారులను వేడుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్ అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ పద్మ రోజా పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో డెక్క తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు అధికారులు స్పందించి పోల్‌రాజ్ డ్రెయిన్‌లో డెక్క తొలగింపు చర్యలు చేపట్టారు. ముదినేపల్లి పోల్‌రాజ్ డ్రెయిన్ వంతెన కెనాల్ వద్ద దట్టంగా పేరుకుపోయిన డెక్కను కూలీలతో తొలగించే పనులు చేపట్టారు. భారీ వర్షాలకు నిండా మునిగిన రైతన్న శీర్షికతో బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టారు.


డెక్క తొలగించిన అనంతరం డ్రెయిన్

పంట బోదెలను పరిశీలించిన ట్రెయినీ కలెక్టర్

భీమడోలు :మండలంలోని గుండగొలను పంట బోదెలను ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా 450 ఎకరాల పంట వర్షపు నీటిలో ముని గిందని స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. 12 గంటలలో పంట బోదె నిర్వహణ చేపట్టి మురుగు నీటిని వెలుపలకు పంపనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, వ్యవసాయ అధికారి ఉషారాణి, స్థానిక రైతులు ఉన్నారు.

అక్టోబర్ 2 నుంచి 'ఆడుకుందాం ఆంధ్ర'

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు భీమడోలు మండల పరిధిలో అక్టోబర్ రెండో తేదీ నుంచి ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భీమడోలు ఎంఇఒ-1 ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సన్నాహక చర్యల్లో భాగంగా స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడీ, ఖోఖోలతో కలిపి ఐదు అంశాల్లో గ్రామ సచివాలయ స్థాయి, మండల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గల ఆట స్థలాల పరిస్థితిపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఎంఎం.పురం హై స్కూల్‌లో ఆట స్థలం లేదని, కురెళ్లగూడెం హైస్కూల్‌కు ఆటస్థలంతో పాటు పాటు వ్యాయామ ఉపాధ్యాయులు లేరని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా పాఠశాల విద్యార్థులు సైతం ఆటలాడేందుకు ఇతర ప్రాంతాలకు రావాల్సి ఉంటుందని, దీనిలో భాగంగా వారికి సమీపంలో ఉన్న గుండుగొలను, భీమడోలు, పూళ్ల, ఆగడాలలంక, పొలసానిపల్లి గురుకులం పాఠశాలల్లో ఉన్న ఆటో స్థలాలను వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. క్రీడా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అనంతరం ఆడుకుందాం ఆంధ్ర భీమడోలు మండల కన్వీనర్ వి.వెంకటేశ్వరరావు ఆటల పోటీలను నిర్వహించాల్సిన తీరుతెన్నులను వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్, ప్రసాద్, విజయలక్ష్మి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో పూడిక తీత పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

భారీ వర్షాలకు మండలంలోని పలు కాలనీల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని గురజ ఇందిరమ్మ కాలనీలో భారీగా వర్షపు నీరు చేరడంతో కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కచ్చా డ్రెయిన్ల ద్వారా నీటిని బయటకు మళ్లించే చర్యలు చేపట్టారు. కాలనీలో కచ్చా డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త చెదారం, పూడికను, నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న కట్టడాలను కూలీలతో తొలగించారు. ఇళ్ల ముందు నిలిచి ఉన్న నీటిని డ్రెయిన్లలోకి పంపుతున్నారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ కార్యదర్శి హారిక పర్యవేక్షించారు.

నాలుగేళ్లలో రూ.108.27 కోట్ల లబ్ధి : ఎంఎల్‌ఎ ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక పదో వార్డు సచివాలయం పరిధి 27, 28, 29 వార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా రూ.108,27,04,678 లబ్ధి చేకూరిందని ఎంఎల్‌ఎ ఎలిజా తెలిపారు. స్థానిక 29వ వార్డు బాలాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు వద్ద జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ ఎలిజా, ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ కమిటీ హాలును ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో అర్హత కలిగి సంక్షేమ పథకాలు దక్కని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 29వ వార్డు కౌన్సిలర్ మానవతా మూర్తి మాట్లాడుతూ పదో సచివాలయాన్ని రెండుగా విభజించాలని కోరారు. వాటర్ ట్యాంక్ బోరు నిర్మాణం, సొంత స్థలంలో ఇళ్ల లోన్, రోడ్డు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు, తీగల మార్పు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందించి ఫోన్‌లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి హెచ్చరించారు.

సభలో వాదన

ఓ దశలో ఇద్దరు మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్‌ఎ ఎలిజా వద్దకు వచ్చారు. వారిలో ఒకరు తన భర్త కరోనాతో మృతి చెందారని, తమను ఎవరూ ఆదుకోవడం లేదని తెలిపారు. మమ్మల్ని పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఈ క్రమంలో కౌన్సిలం కె.లావణ్య సమస్యను సామరస్యంగా వివరించాలని మహిళకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వాదన పెరిగింది. దీంతో కౌన్సిలర్ లావణ్య అనవసరంగా రాద్ధాంతం చేయవద్దని చెప్తూ మహిళను బయటకు వెళ్లాలని చేత్తో నెట్టివేశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన పోలీస్ సిబ్బంది ఆ మహిళను సభా ప్రాంగణం నుంచి బయటకు తీసుకెళ్లడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సంఘటనపై కౌన్సిలర్ లావణ్య మాట్లడుతూ వాదన పడ్డ మహిళ మానసిక స్థితి సరిగలేదని, ఆమె స్థానిక నివాసి కాదని తెలిపారు.

నూజివీడు రూరల్ :మండలంలోని దిగవల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఎంపిడిఒ వి.విజయ్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచి నాని మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామస్తులందరూ తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మెరుగైన రీతిలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తూ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది విధులు, పనితీరును ఆరా తీశారు. ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ వద్ద ప్రజలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జోగి రమేష్ వ్యాఖ్యలు అనుచితం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సభ్యసమాజం తలదించుకునేలా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతుంటే సిఎం జగన్ నవ్వడం సైకో పాలనకు పరాకాష్ట అని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. అమరావతిలో ఇళ్ల నిర్మాణాల పనుల ప్రారంభోత్సవ సభలో మంత్రి జోగి రమేష్ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పవర్‌పేటలోని టిడిపి కార్యాలయం వద్ద పార్టీ ఏలూరు ఇన్‌ఛార్జి బడేటి చంటి ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి, చోడే వెంకటరత్నం, బొరోతు బాలాజీ, గూడవల్లి వాసు, పెద్దిబోయిన శివప్రసాద్, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రసాద్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గురువెల్లి ప్రసాద్ టిడిపి బిసి సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైనట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. ప్రసాద్‌ను నియమించడం పట్ల మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ తనకు పదవి కల్పించిన వీరాంజనేయులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిసిలను ఐక్యం చేసే దిశగా కృషి చేస్తానన్నారు.

వ్యవసాయాధికారి కార్యాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.28.90 లక్షలతో నిర్మించిన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు, రూ.14.90 లక్షలతో నిర్మించిన మండల వ్యవసాయ అధికారి కార్యాలయ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారి ఆలూరు చాముండేశ్వరి, ఎంపిపి ఆరేపల్లి శిరీష, జెడ్‌పి వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు పల్లె రవీంద్రారెడ్డి, బసవరాజు గణేష్, బొబ్బిలి సాయి, డి.స్వర్ణలత, ఎ.శ్రీవాణిచౌదరి పాల్గొన్నారు.